క్లుప్తంగా

ప్రశాంతంగా ఎఫ్‌బీఓ పరీక్షలు



ఆదిత్యలో పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఆదివారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ స్క్రీనింగ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు యూనివర్సిటీ డిప్యూటీ ప్రోచాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. పది పరీక్ష కేంద్రాల్లో 6648 విద్యార్థులకు గాను 5895 మంది పరీక్షలకు హాజరైనట్టు వివరించారు. పరీక్ష కేంద్రాలను పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి, డీఎస్పీ శ్రీహరిరాజు పరిశీలించారు. జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్, ఎస్సైయువి శివ నాగబాబు, జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు, కిర్లంపూడి ఎస్సై సతీష్ బందోబస్తు నిర్వహించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ధర్మవరంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు ఆదివారం పరామర్శించారు. గ్రామానికి చెందిన గుమ్మిడి వర తంత్రి ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని మురళీ కృష్ణంరాజు పరామర్శించి విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ముదునూరి సీతారామరాజు, నానిపల్లి చంటి, కోలా తాతబాబు, తూపాటి బాబ్జి, దాడి పుత్తర్రావు, దాడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు 'తిరగటి'కి అవార్డు



విజయరత్నానికి అవార్డు అందజేస్తున్న మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్

కిర్లంపూడి: తామరాడ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న తిరగటి విజయరత్నం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఇన్స్పిరేషన్ అవార్డు అందుకున్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటంలో నిరంతరం కృషి చేస్తున్న విజయరత్నానికి రాజమహేంద్రవరంలో పాన్ ఇండియా సోసియో కల్చరల్ అసోసియేషన్ సంస్థ ఆదివారం అవార్డును అందజేసింది. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ బుర్ర గోపిమూర్తి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అవార్డు పొందిన ఉపాధ్యాయుడు విజయరత్నంను పాఠశాల హెచ్‌ఎం ఎల్.కృష్ణ, బాలిన నూకరాజు తదితరులు అభినందించారు.

అరుణాచల క్షేత్రాన్ని సందర్శించిన విజయానంద స్వామీజీ



అరుణాచలక్షేత్రంలో అవధూత దత్తపీఠ ఉత్తరాధిపతి దత్తవిజయానంద స్వామీజీ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో కొలువైన అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానాన్ని అవధూత దత్తపీఠ ఉత్తరాధిపతి దత్తవిజయానంద తీర్థ స్వామీజీ సందర్శించారు. ఆదివారం ఉదయం అరుణాచలక్షేత్రానికి వచ్చిన స్వామిజీకి ఆలయ వ్యవస్థాపకులు స్వామి రామానంద, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అరుణాచలేశ్వర స్వామిని దత్తస్వామీజీ దర్శించికుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అపిత కుచాంబ అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా విజయానంద స్వామిజీ భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. అరుణాచల క్షేత్రం మహా పుణ్యక్షేత్రమన్నారు. తమిళనాడులోని అరుణాచలేశ్వర స్వామి ఆలయాన్ని పోలి ఉన్న ఈ దేవస్థానం మహిమాన్విత దేవస్థానంగా బాసిల్లుతోందని తెలిపారు. పౌర్ణమి పర్వదినాన్ని పుస్కరించుకొని అపిత కుచాంబ అమ్మవారికి భక్తులు కుంకుమార్చనలు, లలిత సహస్రనామ పారాయణలు నిర్వహించారు. కాలభైరవ విగ్రహానికి ఆలయ అర్చకులు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు స్వామి రామానంద, ఎల్.తాతాజీ, దేవి తదితరులు పాల్గొన్నారు.

ఇదేం దారిద్ర్యం ?

- గోతులమయంగా రామవరం–రాజపాలెం ప్రధాన రహదారి
- పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని కూటమి నేతలు

జగ్గంపేట: మండలంలోని రామవరం నుంచి కిర్లంపూడి మండలం రాజపాలెం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి గోతులతో అధ్వానంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఈ రహదారికి మోక్షం కలగలేదు. రహదారి పనులు పూర్తి కాకపోవడానికి తప్పు మీదంటే మీదని జగ్గంపేట నియోజకవర్గ అధికార, ప్రతిపక్ష నేతలు విమర్శలు గుప్పించుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ మంత్రి తోట నరసింహం ఇటీవల ఈ రోడ్డు దుస్థితిపై నిరసన తెలిపారు. రహదారిపై ఉన్న గోతుల్లో వరినాట్లు వేశారు.

రూ.29 కోట్లతో పనులు

రామవరం నుంచి రాజపాలెం వరకూ 11.8 కిలో మీటర్ల మేర రహదారి నిర్మాణానికి న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ రూ.29 కోట్లు మంజూరు చేసింది. కాగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 14 రోడ్ల అభివృద్ధి చేయడానికి మొత్తం రూ.250 కోట్లకు ఎంఎస్ సుధాకర్ ఇన్‌ఫ్రా హైదరాబాద్ కాంట్రాక్టర్ 2021లో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. తదనంతరం రోడ్డు పనులు ఒకచోట జరగడం, మరో చోట జరగకపోవడంలో జాప్యం, బిల్లుల పెండింగ్, రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా మారడం, ధరలు పెరగడం తదితర పరిణామాలతో కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయకుండా నిలిపివేశారు. పాత బకాయిలు చెల్లిస్తే తప్ప తాను పనులు చేయలేనని అధికారులకు తేల్చి చెప్పినట్లు సమాచారం. 14 రోడ్లకు మొత్తం ఒకటే కాంట్రాక్టు కావడంతో ఈ సమస్యను ఎలా తేల్చాలో తెలియక అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నారు. కాంట్రాక్ట్ రద్దు చేయడానికి అనేక చిక్కుముడులు ఉన్నట్లు సమాచారం. దీంతో రామవరం, రాజపాలెం రోడ్డుకు ఇప్పట్లో మోక్షం లభించే సూచనలు కనిపించడం లేదు.

రామవరం నుంచి రాజపాలెం వరకూ రోడ్డు నిర్మాణానికి రూ.29.8 కోట్లు మంజూరయ్యాయి. దీంతో 3.7 మీటర్లు ఉన్న రోడ్డును 7 మీటర్ల మేర వెడల్పు చేయడం, రోడ్డును పటిష్టం చేయడం, 11 చోట్ల శ్లాబ్ కల్వర్టులు, ఐదు బ్రిడ్జిలు, 25 పైపులైను కల్వర్టులు కాంట్రాక్టర్ నిర్మించాలి. కాంట్రాక్టర్ రోడ్డు వెడల్పు చేసి, పైపులైన్ కల్వర్టులు నిర్మించారు. రూ.8.9 కోట్లు పనులు కాంట్రాక్టర్ చేయగా ఆయనకు సుమారుగా రూ.1.35 కోట్లు తప్ప మిగిలిన సొమ్మును ప్రభుత్వం చెల్లించింది.

ఈ నేపథ్యంలో ఎలాగైనా రోడ్డు పని పూర్తి చేయించాలని ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు తగ్గించి రూ.24 కోట్లకు పనిని కుదించారు. అయినా కాంట్రాక్టర్ పనులు చేయడానికి ముందుకు రావటం లేదు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని కాంట్రాక్టర్‌తో పనులు పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



రామవరం వద్ద గోతుల్లో చేరిన నీరు



రామచంద్రపురం వద్ద రోడ్డు దుస్థితి



రామవరం-రాజపాలెం రోడ్డుపై నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి తోట నరసింహం, వైఎస్సార్ సీపీ నేతలు (ఫైల్)

అష్టకష్టాలు పడుతున్నాం.



గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రోడ్లను పట్టించుకోలేదని కూటమి నేతలు విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా రామవరం–రాజపాలెం రోడ్డు సమస్యను పరిష్కరించడం లేదు. పాత కాంట్రాక్టర్‌ను తొలగించి కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించి పూర్తి చేయాలి. ఈ రోడ్డుపై వెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నాం.

– గంధం బాబి, రామవరం, జగ్గంపేట మండలం

కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెస్తున్నాం

రోడ్డు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెస్తున్నాం. కాని అతను ముందుకు రావటం లేదు. అతని ఇబ్బందులు తాను చెపుతున్నాడు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నారు.

– రాఘవరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ, పెద్దాపురం

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: పౌర్ణమి సందర్భంగా ఆదివారం రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులతో పాటు 30 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు. దేవస్థానానికి రూ.22,500 ఆదాయం సమకూరింది. వేద పండితులు యనమండ్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, చిట్టెం వాసు, వేణు, చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

అన్నసమారాధన

రౌతులపూడి: గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని మండలంలోని మల్లంపేటలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. భక్తుల సహకారంతో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాలను స్వీకరించారు.

కూటమి పాలనలో రైతులకు వంచన

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రాజా
- అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరణ



తునిలో అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, యనమల కృష్ణుడు, నాయకులు

తుని: కూటమి ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేసిందని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా అన్నారు. ఖరీఫ్ సీజన్లో వరి, ఇతర పంటలకు అవసరమైన యూరియాను అందుబాటులోకి తీసుకువరావడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇదే అదునుగా కూటమి నేతలు బ్లాక్ మార్కెట్ దందాను నడుపుతున్నారని ధ్వజమెత్తారు. తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి రాజా నెల 9న జరిగే అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా కొరత ఉందని ప్రభుత్వ అధికారులు, కూటమి నేతలే చెబుతున్నారన్నారు. వచ్చిన ఎరువును ఆధార్ కార్డులతో నాయకులు బ్లాక్ చేసి అదనంగా రూ.200 ఎక్కువకు అమ్ముకుంటున్నారని విమర్శించారు. అధికారులు పట్టాదారు పాస్ పుస్తకాలను పరిగణలోకి తీసుకుని పంపిణీ చేయాలన్నారు. రైతులకు అండగా వైఎస్సార్ సీపీ ఉంటుందన్నారు. ఈ నెల 9న పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో జరిగే పోరు యాత్రను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రాల్లో సోమవారం మీడియా సమావేశం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. తొండంగి మండలంలో ఎ.కొత్తపల్లి, తుని మండలంలో డి.పోలవరం, కోటనందూరులో అన్నదాత పోరుయాత్ర పోస్టర్ ఆవిష్కరణ చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు యనమల కృష్ణుడు, తుని, తొండంగి, కోటనందూరు, తుని పట్టణ పార్టీ అధ్యక్షులు దుంగల నాగేశ్వరరావు, బత్తుల వీరబాబు, చితకాయల చినబాబు, అన్నవరం శ్రీను, మహిళా విభాగం అధ్యక్షురాలు అంగుళూరి సుశీల, కోటనందూరు ఎంపీపీ లగుడు శ్రీనివాస్, రైతు విభాగం అధ్యక్షుడు బొంగు ఉమారావు, రాష్ట్ర అధికార ప్రతినిధి లాలం బాబ్జి, రాష్ట్ర మున్సిపల్ వింగ్ కార్యదర్శి రేలంగి రమణాగౌడ్, నాయకులు గొర్లి రామచంద్రారావు, నాగం గంగ బాబు, పోతల రమణ, నాగం దొరబాబు, నల్లమిల్లి గోవిందు, సీహెచ్.రాంబాబు రాజు, రాజబాబు రాజు, లంక ప్రసాద్, గంటా చక్రరావు, యెలిశెట్టి గిరి, మూడు మండలాలు, పట్టణానికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు
- అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరణ



కిర్లంపూడిలో అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిబాబు, పార్టీ నేతలు

కిర్లంపూడి: రైతులకు ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు విమర్శించారు. కిర్లంపూడిలోని మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం నివాసంలో ఆ పార్టీ నాయకులతో కలిసి ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై ఈ నెల 9న నిర్వహించే అన్నదాత పోరు కార్యక్రమం పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులందరికీ సకాలంలో విత్తనాలు, యూరియా సరఫరా చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతు సేవా కేంద్రాల వద్ద ఉదయం నుంచి రైతులు పడిగాపులు కాస్తున్నా యూరియా అందడం లేదని విమర్శించారు. కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామంటూ నిబంధనలు పెట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. యూరియా కొరత ఉన్నప్పటికీ స్టాక్ సిద్ధంగా ఉందని అధికారుల చేత చెప్పించడం విడ్డూరంగా ఉందన్నారు. రైతుల సమస్యలు తీర్చేందుకే ఈ నెల 9న పెద్దాపురం ఆర్డీవో కార్యాలయం వద్ద అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని రైతులు, పార్టీ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గిరిబాబు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌతు స్వామి, మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీశివకుమారి, గొల్లుదివానం, శిడగం వెంకటేశ్వరరావు, కాకి నాని, రామిశెట్టి నాని, నరాల శ్రీను, గొల్లపల్లి కాశి తదితరులు ఉన్నారు.

బస్తా యూరియా కోసం యుద్ధాలు

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ తోట నరసింహం



జగ్గంపేటలో అన్నదాత పోరు పోస్టర్‌ను విడుదల చేస్తున్న మాజీ మంత్రి తోట నరసింహం, పార్టీ నేతలు

జగ్గంపేట: కూటమి ప్రభుత్వంలో రైతులు బస్తా యూరియా కోసం యుద్ధాలు చేయాల్సిన దుస్థితి వచ్చిందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. జగ్గంపేటలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు కార్యక్రమం పోస్టర్‌ను ఆయన పార్టీ నేతలతో కలిపి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటకు యూరియా ఎంతో అవసరమన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు యూరియా అందుబాటులో లేకుండా ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు. కూటమి నేతలు యూరియాను బ్లాక్ మార్కెట్ చేసి అధిక ధరలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతులు వరిసాగు చేయడం ఇష్టంలేదని, ఈ విషయాన్ని ఆయన పలుసార్లు చెపుతూ వచ్చారని గుర్తు చేశారు. యూరియా లేకుండా చేసి దెబ్బకొడితే రైతులు వరిసాగుకు దూరమవుతారని ఎత్తుగడ వేశారని విమర్శించారు. కూటమి తీరుకు నిరసనగా ఈ నెల 9వ పెద్దాపురంలో ఆర్‌డీఓ కార్యాలయం వద్ద చేపట్టే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నేతలు రామకుర్తి జగాల్, వరుపుల సూరిబాబు, రామకుర్తి మూర్తి, వుయ్యూరి నాని, కరుటూరి వీర్రాజు, రావుల గణేష్ రాజా, మద్దిపట్ల రామకృష్ణ, ఒబిడ్డి వీరబాబు, భూమాడ గణపతి, శరకణం అచ్చిరాజు, నకిరెడ్డి విష్ణు, సప్పా రఘు తదితరులు పాల్గొన్నారు.

తోటను కలిసిన నాని



జగ్గంపేటలో తోట నరసింహాన్ని సత్కరించిన వుయ్యూరి నాని

జగ్గంపేట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం జనరల్ సెక్రటరీగా నియమితులైన వుయ్యూరి నాని ఆదివారం మాజీ మంత్రి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహాన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. జగ్గంపేటలోని పార్టీ కార్యాలయంలో తోటను కలిసి శాలువా, పూలమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం

తొండంగి: వేసవిని తలపించేలా కాస్తున్న ఎండలతో విలవిల్లాడిన ప్రజలు ఆదివారం సాయంత్రం కురిసిన మోస్తరు వర్షంతో ఉపశమనం పొందారు. కొద్ది రోజులుగా వేసవిని తలపించేలా ఎండతీవ్రత ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎండ, ఉక్కబోత ఎక్కువగా ఉంది. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. వర్షానికి వాతావరణం చల్లబడడంతో ప్రజలు సేద తీరారు. కాగా బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు సూచించారు.



దానవాయిపేట సముద్రతీరంలో ఎగసిపడుతున్న అలలు



రహదారి చెంతనే పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు

వ్యర్థం.. అనర్థం

- ఏలేశ్వరం–తిరుమాలి రహదారి చెంతనే పేరుకుపోయిన వ్యర్థాలు
- అవస్థలు పడుతున్న రైతులు

ఏలేశ్వరం: గ్రామాల్లో పారిశుధ్యం పడకేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఏలేశ్వరం నుంచి తిరుమాలి వెళ్లే ఆర్ అండ్ బీ రహదారి (పుంతరోడ్డు) అధ్వానంగా మారడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. నిత్యం రైతులు రాకపోకలు సాగించే రహదారిని ఆనుకుని చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. పట్టణశివారులో ఉన్న రహదారి చెంతనే చుట్టుపక్కల వారు బహిరంగ మలవిసర్జన చేయడంతో దుర్గంధం భరించలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు రహదారి చెంతనే ఉన్న శ్మశానంలో తుప్పలు భారీగా పెరిగిపోవడంతో పాముల సంచారం ఎక్కువగా ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. వర్షాలు పడితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని రైతులు వాపోతున్నారు. చెత్త, వ్యర్థాల్లో పందులు సంచరించడంతో రైతులు అటు వైపు వెళ్లేందుకు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉత్సాహంగా గణేశ్ నిమజ్జనాలు

ఏలేశ్వరం: వినాయక చవితి ఉత్సవాలు ముగియడంతో గణపతి విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేశారు. స్థానిక పల్లపువీధితో పాటు పలు ప్రాంతాల్లో నెలకొల్పిన వినాయకుని విగ్రహాలను ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఊరేగించి స్థానిక ఏలేరు కాలువలో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో తీన్‌మార్, సన్నాయి మేళం, భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. స్థానిక మెయిన్ రోడ్డు, బాలాజీ చౌక్, మార్కెట్ రోడ్డు, పల్లపు వీధి మీదుగా ఊరేగింపు నిర్వహించారు. నిమజ్జనంలో మహిళలు, యువకులు సందడి చేశారు.

గండేపల్లి: మండలంలోని గణేశ్ నిమజ్జనాలు వైభవంగా జరుగుతున్నాయి. గండేపల్లిలో నెలకొల్పిన భారీ గణపతి విగ్రహాన్ని ఆదివారం నిమజ్జనం చేశారు. డప్పువాయిద్యాలు, మేళతాళాలు, శక్తి వేషాలు, తీన్‌మార్ డప్పులతో స్వామివారిని ఘనంగా ఊరేగించారు. మహిళలు, యువకులు ఊరేగింపులో సందడి చేశారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం, రాచపల్లి, ఒమ్మంగి తదితర గ్రామాల్లో గణేశ్ నిమజ్జనాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఆదివారం రాత్రికి చంద్ర గ్రహణం ఏర్పడుతున్న నేపథ్యంలో వినాయక విగ్రహాలను బాణసంచా కాల్పులు, డప్పులు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించి పోలవరం, పుష్కర కాలువలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

స్థానిక తోటవీధిలోని భవానీపురంలో మహిళలు ప్రతిష్ఠించిన గణపతి విగ్రహాన్ని ఆదివారం నిమజ్జనం చేశారు. మేళతాళాలు, బాణసంచా కాల్పులతో స్వామివారి విగ్రహాన్ని ఊరేగించి లంపకలోవ మార్గంలోని పుష్కర కాలువలో నిమజ్జనం చేశారు. అలాగే గోకవరపు వీధి, ఇందిరా కాలనీ, అంబేడ్కర్ నగర్ తదితర ప్రాంతాల్లోని వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసువెళ్లి పుష్కరలో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.



ప్రత్తిపాడు గణపతి ఊరేగింపులో భక్తుల సందడి



ఏలేశ్వరంలో గణపతి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



గండేపల్లి ఊరేగింపులో ఆకట్టుకున్న శక్తి వేషాలు

చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ

కిర్లంపూడి: ఈ నెల 15న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ భవన నిర్మాణ అదర్ కన్‌స్ట్రక్షన్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు పిలుపునిచ్చారు. కొత్తపేటలో మండల భవన నిర్మాణ, అదర్ కన్‌స్ట్రక్షన్ కార్మికులతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. కార్మికులతో కలిసి చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో భవన నిర్మాణ కార్మికులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తానని కూటమి ప్రభుత్వం హామీలు ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి 13 నెలలు గడిచినా హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. హామీల అమలు కోరుతూ విజయవాడలో నిర్వహించే ధర్నాకు అన్ని యూనియన్ల నాయకులు, కార్మికులు తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో టి.జీవా, శరకణం అంజి, పి.పాండు, వై.రాంబాబు, ఎస్.ఏసుబాబు పాల్గొన్నారు.

ఏలేరులో పెరిగిన నీటినిల్వలు

ఏలేశ్వరం: పరివాహక ప్రాంతంలో పడుతున్న వర్షాలకు ఏలేరులో నీటినిల్వలు పెరుగుతున్నాయి. ఎగువప్రాంతంలో పడుతున్న వర్షాలకు ఆదివారం ప్రాజెక్టులోకి 1.002 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. సీతానగరం మండలం పురుషోత్తపట్నం నుంచి 1.225 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 86.46 మీటర్లకు 81.45 మీటర్లు, 24.11 టీఎంసీలకు 15.13 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. దీంతో ఆయకట్టుకు 800. విశాఖకు 175 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. తిమ్మరాజుచెరువుకు నీటి విడుదల నిలిపివేశారు.